
# ఓ మగాడి ప్రయాణం..?

కోరం రాజబాబు



అదొక కదలిక... మనసులో చిన్న కదలిక... మౌనంగా నెమ్మదిగా మనసును కుదిపి కుదిపి వూపేసే కదలిక.

***

తెల్లారకుండానే అతను వెళ్తాడు.

ఎక్కడికెళ్తాడో? ఆమె ప్రశ్న ఆమెకే విచిత్రంగా అనిపిస్తుంది.

అతనెక్కడి కెళితే ఏమిటి? అయినా తనకెందుకు?

అలా అనుకోవడం ఆమెకు నచ్చదు... అయినా... అనుకుంటుందామె.

ఒక్కసారి కాదు... కొన్ని వందల సార్లు...

అలా అనుకుని అలసిపోవటానికి అది గొంతెత్తి అరవటం కాదు...

రాత్రికెప్పుడో వస్తాడు.

ఒక్కో రాత్రి అస్సలు రాడు.

ఆమె నిద్రపోదు. నిద్రపోతే వూరుకోడు.

లేపేస్తాడు... ప్రేమగా ఓ పలకరింపు కోసం మాత్రం కాదు!

కసిగా మనసును తూట్లు పొడవటానికి.

అలంకరించుకుంటే ఎవడి కోసం అంటాడు.

అలంకరించుకోకపోతే రొమాన్స్ తెలీదంటాడు.

అతనికి అన్ని సపర్యలూ చేయాలి. అక్కడ మాత్రం ఆమె పని మనిషి.

ఆమె నవ్వకూడదు. నవ్వితే ఎందుకా దొంగనవ్వు అంటాడు.

ఏడిస్తే... నీకేం రోగమంటాడు.

ఎన్నో రాత్రులు... ఎన్నో ఎదురుచూపులు కలలా కరిగిపోయాయి.

కవ్వింతలు... కను సైగలు... చిలిపి నవ్వులు... చిరుస్వేదాలు కర్కశంగా ఆవిరైపోయాయి.

కన్నీళ్లు కాటుకను కరిగించినా... కనుపాపలు జాలిని ప్రకటించినా పట్టించుకోడు.

యుగానికో మాట. ఎప్పుడైనా అవసరానికో స్పర్శ.

అదీ కొద్ది సేపే. ఒక పెనుతుఫానులా అతను విరుచుకుపడినప్పుడు ఆమె గొంతులోంచి ఓ పెద్ద మూలుగు. మనసు రెక్కలు విరిగిపోయిన ఫీలింగ్.

ఆమెకిది అలవాటైపోయిన జీవితం. అలల పోటుకు చిన్నాభిన్నమైపోయిన తీరంలా ఉన్న తన జీవితం... అందుకే తలవంచింది. మౌనాన్ని తోడుగా ఆశ్రయించింది. జీవితం ఇలాగే ఉంటుందని రెండేళ్ల క్రితం ఆమెకు తెలిస్తే ఆమె పెదాల చిరునవ్వులు ఇలా వాడిపోయేవి కావు.

***

"సంధ్యా... పెళ్లికొడుకు నీకు నచ్చాడా? అతని పేరు మధుసూదన్...."! కాఫీ అందించాక వంటగదిలో తల్లి అడిగినప్పుడు ఆమె మౌనంగా ఉండిపోయింది. చదువు

మధ్యలో ఆగిపోతుందన్న భయంతో అప్పుడే పెళ్లొద్దు అని పెళ్లి కొడుకు వెళ్లిపోయాక నెమ్మదిగా గొణిగితే అందరూ తలోమాట అనేసారు.

అంత అందగాడు. పైగా డబ్బు, మంచి వ్యాపారం ఉన్నవాడు నీకు దొరుకుతాడా? నువ్వు నచ్చావ్ కాబట్టి అతను వెంటనే పెళ్లి చేసేయాలని చెప్పి మరీ వెళ్లాడు. నువ్వు అనవసరంగా మాట్లాడకు. నిన్ను పెద్ద చదువులు చదివించే శక్తి కూడా మాకు లేదు. నాకు మరో మాట అనే ఛాన్స్ లేకుండా అంతా తేల్చి పారేశారు.

నిజానికి... అతన్ని ఇష్టపడక పోవటానికి ఆమెకు రీజన్ అంటూ ఏమీ లేదు. అతను బాగున్నాడు. పెళ్లి చూపుల్లో అతని చిలిపి నవ్వులు ఆమెలో కాసేపు గిలిగింతలు పెట్టడం అందరూ ఎక్కడ గమనిస్తారోనని ఆమె కంగారు పడింది కూడా. తప్పించుకునే ఛాన్స్ ఆమెకు కలగలేదు. నిజానికి తప్పించుకోవాల్సిన మ్యాచ్ అని ఆమె అనుకోలేదు.

***

పెళ్లయ్యాక అతన్తో జీవితం మొదట్లో అర్థం కాలేదామెకు. డబ్బు, సౌకర్యాలు ఆమె అడగకుండానే వచ్చి పడ్డాయి. వాటికోతోడు ఒంటరితనం నెమ్మదిగా జత కలిసింది. అతను ఎప్పుడు నవ్వుతాడో... ఎప్పుడు విరుచుకుపడతాడో తెలిసేది కాదు. పగలంతా ఆమెకు ఒంటరితనం. రాత్రంతా భయం. మొదట్లో ఆమె మాట్లాడేది. మాట కలిపేది. అలా మాట కలిపినప్పుడు చివ్వున తలతిప్పి చూసే అతని చూపులు నచ్చేవి కావు. పెళ్లి చూపుల్లో అతని చిలిపి చూపులు కనపడకపోయేసరికి ఆమెకు ఏడుపొచ్చేది. అతనేనాడూ ఆమెను పట్టించుకోలేదు. అతనో విలాస పురుషుడు. అతనికి ఆడది కావాలి. భార్యలో అవసరాన్ని మాత్రమే చూస్తాడు.

ఆమె అన్నీ భరించింది. అతని మూర్ఖత్వాన్ని... అతని విచ్చలవిడితనాన్ని... అతని ఉద్రేకాన్ని... అతని శాడిజాన్ని... ఇలా... ఒక్కటేమిటి? అతనో మృగం... అందుకే ప్రేమతో బంధించలేకపోయింది. చివరకు మనసును దాచేసుకుంది. గొంతును పూడ్చేసుకుంది. భావోద్రేకాలను అణిచి వేసుకుంది. మౌనంగా ఉండిపోయింది.

***

అర్ధరాత్రి పన్నెండు గంటలు. అతను విసురుగా బెడ్రూంలోకి వచ్చాడు... వస్తూనే... ఛ! వీళ్లను క్షమించకూడదు. నాతో ఉంటూనే మరొకడితోనా! ఎంత నటన! ఒక్కరు... ఒక్కరంటే ఒక్కరు! పరువాలన్నీ ఆరేస్తారు... ఎంతమంది దగ్గరయినా సరే! నమ్మకూడదు... వీళ్లను నమ్మకూడదు... వీళ్లకు డబ్బు కావాలి.... డబ్బెవడిస్తే వాడే కావాలి.

అతను ఆవేశంగా గొణుగుతుంటే ఆమె రెప్పవాల్చకుండా అతన్నే చూస్తోంది. ఓ కొత్త వ్యక్తిలా కన్పించాడామెకు... ఆమె అతన్ని గమనిస్తూనే మౌనంగా వుంది.

ప్రేమ... రొమాన్స్... థ్రిల్ ... ఏంటవి? నువ్వు చెప్పు... ఆడదానివేగా!

ఆడదాన్నని అడుగుతున్నారా?

"నువ్వు ఆడదానివేగా!" అసహనంగా అన్నాడతను.

"ఆడదాన్నే... మీ భార్యను కూడా!" అందామె కోపాన్ని ఆపుకుంటూ.

అతను సూటిగా ఆమె వైపు చూశాడు. ఆ చూపులో కోపం లేదు. ఆమె కళ్లలో ఏదో విస్మయం...!

ఏదో జరుగుతోంది. మనసుకు అందనిదేదో... కొత్తగా... ఉత్సాహంగా... ఉద్వేగంగా అతన్నే చూస్తోందామె...

అతను బెడ్మీద కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఒక్కోసారి నా వైపు చూస్తూ వేగంగా చూపుల్ని తిప్పుకుంటున్నాడు.

"మీరు పడుకుంటారా లైటు తీసేస్తాను" అందామె మెల్లగా...

అతనిలో మౌనం.

"మిమ్మల్నే... నిద్రరావటం లేదా?" తిరిగి అడిగింది.

"పోనీ... కాసేపు మాట్లాడుకుందామా?" ధైర్యం తెచ్చుకుని అడిగింది.

ఏ.సి. శబ్దంలో కూడా అతని వూపిరి ఆమెకు వినిపిస్తోంది.

"ఏంటి మౌనంగా వున్నారు? మీకు మాట్లాడాలని లేకపోతే నేనే మాట్లాడతాను" కాస్తంత చొరవ తీసుకుంది.

అతను... ఆమె వైపు .సూటిగా చూడలేక చూస్తున్నాడు.

సరే.. సరే...!

మగాడు.. ఆడది...!

ఇద్దరి మధ్యా సెక్స్ ఒక్కటేనా? మంచి కమ్యూనికేషన్ ఉండదా?

శరీరాన్ని కోరికలకు వదిలేస్తే తృప్తి దొరుకుతుందా? అలా అయితే మనసు మాటేమిటి? కేవలం ఇద్దరు మనుషులు బ్రతకటం... ఇలా మనలా...! అతను కాస్త కోపంగా చూశాడు.

ఎందుకు... ఆ మాటంటే మీకు బాధగా ఉందా?

ఆ బాధను నేను రెండేళ్లు అనుభవించాను.

మనసు... అదేంటో తెలుసా? చిన్న స్పర్శకు.. చాలా చాలా చిన్న స్పర్శకు లొంగిపోతుంది... మీరు ప్రేమ ... రొమాన్స్... అడిగారే! చెప్పటానికి ఇదేమన్నా చరిత్ర పాఠమా? మనసు.. శరీరానికి సంబంధించింది... మనసుకు దగ్గరగా అంటే తెలుసా మీకు... అదో పూల వుయ్యాల... ఊగితే హాయిగా వుంటుంది. అనుభవిస్తే తెలుస్తుందది. మీలా పరుగెడితే ప్రేమ దొరకదు. రొమాన్స్... అదో చిలిపి

## మరాఠీ చిత్రంలో సోనాలి

చాలా కాలంగా బాలీవుడ్లో వుంటున్నా, అందం, ప్రతిభా వున్నా, అదృష్టం లేని కారణం చేత నటి సోనాలీబెంద్రే కెరీర్ గ్రాఫ్ వున్న చోటే వుండిపోయింది. ఇప్పుడు పెళ్లయ్యాక మరో నటుడు అమోల్ పాలేకర్ తీస్తున్న మరాఠీచిత్రంలో చేస్తుంది సోనాలి. 'అనాహత్' అనే ఈ చిత్రంలో సోనాలిది ప్రధానపాత్ర. ఇదే కాకుండా, మరిన్ని చిత్రాల్లోనూ అతిథినటిగా చేస్తున్నదిట సోనాలి. అయినా పెళ్లయ్యాక ఇలా అవకాశాలొచ్చాయేంటి చెప్మా?



ఎస్.

ఊహ... నచ్చిన ప్రతి ఆడదానితో పరుగెత్తడం రొమాన్స్ కాదు.. మీకు ఎదురైన వాళ్లంతా.. హైహీల్స్ చెప్పులు వేసుకుని కాళ్లు కాస్త పైకి లేపి మీకు ముద్దులిచ్చేస్తే అది రొమాన్స్ కాదు. వాళ్లు మీకన్నా ఎదగడానికి మిమ్మల్ని ట్రాప్ చేయడం అంటారు.

క్రీముల్తో ముఖం రంగు మార్చేసి... లిప్‌స్టిక్కుల్తో... మత్తు చూపుల్తో... వూపిరాడకుండా చేసి..... పచ్చిగా... నిక్కచ్చిగా... మీకే నా సర్వం అంటూ తేలిపోయే మాటల్తో... తెలివైన పట్టుబిగించే ఆడది... ఆమె ఆడదే... ఆడేదే... చివరకు మిమ్మల్ని ఆడించేదే.

బుద్ధి... అది వంకరైతే... సల ఎల కాలే నిప్పులకొలివి కావాలా?

వివేకాన్ని వదిలేసి... గౌరవాన్ని వీధుల్లో దులిపేసి...

చెత్తకుండీలా కుల్లి కంపుకొడుతున్న మీకు... పరిమళం విలువేం తెలుసు?

పరుగు... ఎటు వెళ్తున్నారో... మీకు తెలుసు... ఆపకండి... మీరూ ఆగకండి...

మీలా నేను పరుగెడితే.. కొన్ని వందల పురుషుల కళ్లు కొరిమిలా కాల్తాయి. మెదడు నరాలు నిశ్శబ్దంగా చిట్లిపోతాయి. నన్ను పరిశీలనగా మీరెప్పుడయినా చూశారా? పోనీ నా ముఖాన్ని చూశారా?

అమ్మ అనేది... నా దిష్టే నీకు తగులుద్ది... అని.

అప్పుడప్పుడూ నాలో మీకు ఆడది కనిపిస్తే... దౌర్జన్యంగా దూసుకొస్తారు.. మీకు నాలో భార్య కనపడకపోవడం మీ క్యారెక్టర్ లోపం... లోతుగా చెప్పాలి కదూ....! భార్య... బ్రతికినంత కాలం భర్తను కళ్లలో నింపుకునేది... మీ దృష్టిలో మాత్రం ఆడది... మీరనుకుంటున్న ఆడది.

ఆడదాని మనసేంటో నాకు తెలీదు కాని... భార్య మనసు మాత్రం మంచు ముద్ద. వెచ్చని మాటలకూ... వెచ్చని స్పర్శకూ కరుగుతుంది. ఎలా మలుచుకుంటే అలా మారుతుంది. నిజానికి మీరనుకుంటున్న ప్రేమ... ప్రేమే కాదు... మీరు చేసే ప్రతి పనికీ అందంగా రొమాన్స్ అని తగిలిస్తే ఎలా?

చీకటిలో మీరు ఇంతకాలం చేసింది రొమాన్స్ కాదు. రొచ్చువనంటారు. అందుకే ... రొమాన్స్ బెడ్‌రూంలో చేయాలి. భార్యతో చేయాలి. కాస్త వచ్చిగా చెప్పనా...! రొమాన్స్‌కు వెలుతురు కావాలి. ప్రేమించే మనసు కావాలి. మీరడిగారని కాదు... ఇవన్నీ మన తొలిరోజు నాటి నా ఊహలు... ఇంకా అలాగే ఉన్నాయి...

నాకు నిద్రొస్తోంది. మీరూ పడుకోండి! ఎప్పటిలాగే ఓ మూలకు ఒదిగి నిద్రలోకి జారిపోయిందామె.

కనురెప్పలు భారంగా పడిపోతుంటే బలవంతంగా కళ్లు తెరిచి చూసింది.

ఎప్పటిలాగే అతను బెడ్ మీద లేదు.

"అతను వెళ్లిపోయాడా?" సంశయంగా అనుకుంది.

నెమ్మదిగా లేచి క్రింద హాలులోకి వచ్చింది.

అతనక్కడున్నాడు. రిలాక్సింగ్‌గా పేపర్ చదువుతున్నాడు.

అతనక్కడుండటం ఆశ్చర్యమనిపించలేదు. తలొంచుకుని కిచెన్‌లోకి వెళ్లింది.

"అతను వెనకాలే వచ్చి... నువ్వు నిద్రపోతున్నావని డిస్టబ్ చేయలేదు. నేను లంచ్‌కి ఇంటికి వస్తాను. ఈ మాట చెబుదామనే వెయిట్ చేశాను" కంగారుగా ఆ నాలుగు మాటలు అనేసి వెళ్లిపోయాడు.

తప్పుచేసిన వాడు మౌనంగా... అసహనంగా ఉంటాడు. తప్పుదిద్దుకున్న వాడు మాత్రం ఎప్పుడూ మౌనంగానే ఉంటాడు.

అతని మొదటి ఫ్రేమ్ ఆమెకు తెలుసు.

మరి రెండో ఫ్రేమ్‌లో అతను అర్థమవుతున్నాడో లేదో...?

ఆమె మనసింకా స్తబ్ధతగానే ఉంది.

మాట కలపటం... కళ్లలోకి చూడాలనుకోవడం... అలా చూడలేక తలదించుకోవడం...!

అతను రోజూ లంచ్‌కి ఇంటికి వస్తున్నాడు. రాత్రికి త్వరగా వస్తున్నాడు నాలుగు రోజులుగా అలా జరుగుతూనే వుంది.

కమ్యూనికేషన్ మాత్రం ఎస్టాబ్లిష్ కావడం లేదు... కనక్టివిటీ లేని మూమెంట్స్ అన్నీ వృథా అవుతున్నాయి.

అతను ఆలోచిస్తున్నాడు.

ఆమె ఆలోచనల్ని కట్ చేస్తోంది.

అతను ఆశగా చూస్తున్నాడు.

ఆమె అతన్ని చూస్తూనే అప్పుడప్పుడూ తననీ చూసుకుంటోంది అద్దంలో...

ఆమెకేదో స్పష్టమవుతోంది. ఇంతకాలం నిర్జీవంగా ఉన్న కళ్లు వింతగా మెరుస్తున్నాయి. చెక్కిళ్లు గులాబీ రంగులోకి మారి ఆకర్షణ పుట్టిస్తున్నాయి.

అతను దగ్గరవుతున్నట్టే ఉన్నాడు.

తను ఇంకా దూరంగానే ఉండాలా...?

ఆమె మనసు వూరుకోవడం లేదు.

అతన్తో మాట్లాడితే...?

ఆ ఊహకే నవ్వొచ్చిందామెకు. మొన్న ఎంత మొండిగా మాట్లాడిందీ గుర్తొచ్చి నొచ్చుకుంది. అయినా చూపులు కలుసుకోవడం కన్నా గొప్ప కమ్యూనికేషన్ ఏముంటుంది? అతనిప్పుడు అందంగా నవ్వుతున్నాడు. నాతో మాట్లాడాలనుకుంటున్నాడు. నా హృదయానికి దగ్గరగా వస్తున్నాడు. అంతకన్నా ఏం కావాలి?

ఆమె మనసిప్పుడు పాజిటివ్‌గా ఆలోచిస్తోంది. అతనికేది కావాలో ఆమెకు తెలుస్తోంది. ఆమెకు కావాలసింది దొరికాక అతని గురించి ఆలోచించడం ప్రారంభించింది.

ఆరోజు అతను చీకటి పడకముందే ఇంటికొచ్చాడు.

***


తెల్లారింది... ఆమె లేవలేదు. మనసుకు ప్రశాంతత. ...ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. మెలుకువ వచ్చేసరికి బాగా పొద్దెక్కిపోయింది. కళ్లు తెరిచి ఎప్పటిలాగే ప్రక్కకు చూసింది.

అతను ప్రశాంతంగా నిద్రపోతున్నాడు...

ఈరోజు కోసం ఎంత నిరీక్షణ...?

తన్మయత్వంతో అతన్ని క్రీగంట చూసింది. అదేదో కలలా ఉందామెకు... ఇది చాలు... మనసంతా గిలిగింతలు పెడుతూంటే... అనుకుందామె తృప్తిగా. అలికిడైతే అతనెక్కడ లేస్తాడోనని... కంగారు పడుతూ ఆ దృశ్యం అలా కళ్లలో నిలిచిపోవాలని కనురెప్పల్ని మూసేసింది దుప్పటిని మీదకు కప్పుకుంటూ...!

■



## డాన్సర్‌ను కాను!

ధర్మేంద్ర పెద్ద కుమారుడు సన్నీదేవల్ అన్నాడలా. తన పంతొమ్మిదేళ్ల సినిమా జీవితంలో తనెన్ని చిత్రాల్లో చేశాడో పెద్దగా గుర్తు లేదు కానీ దాదాపు 60 చేసుంటానన్నాడు సన్నీ. తండ్రిలాగే డాన్సులు చేయటమంటే సన్నీ ఇబ్బంది పడతాడు. దాన్ని గురించే చెబుతూ, "కథతో పాటుగా నడిచిపోయే డాన్సులు చేయగలను. సహజంగా నటుణ్నే కానీ, మైకేల్ జాక్సన్, జాన్ ట్రవోల్టా వంటి డాన్సర్‌ను కానుగా!" అంటున్నాడు.

ఎన్.